# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 24-01-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రపతి ద్రౌపది ముర్మ్ము 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతిని ఉద్దేశించి రేపు ప్రసంగించనున్నారు.
- ❖ దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా యువతకు ఉపాధి అవకాశాలను సృష్టించడానికి కేంద్రప్రభుత్వం కృషి చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- ❖ యువత శారీరకంగా, మానసికంగా, బలంగా ఉండాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.
- ❖ బుద్ధుని బోధనలు ప్రపంచ వ్యాప్తంగా ప్రభావితం చేస్తున్నాయని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు తెలిపారు.
- ❖ అండర్-19 ప్రపంచ కప్ లో భారత్.. న్యూజిలాండ్‌పై 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

= = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రపతి ద్రౌపది ముర్మ్ము 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతిని ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ ప్రసంగం రేపు సాయంత్రం 7 గంటల నుండి ఆకాశవాణి జాతీయ నెట్‌వర్క్ ద్వారా ప్రసారం అవుతుంది. అదేవిధంగా.. దూరదర్శన్‌లోని అన్ని కేంద్రాల ద్వారా హిందీలో ప్రసారం చేయబడుతుంది. ఆ తర్వాత ఆంగ్లంలో ప్రసారం అవుతుంది. దూరదర్శన్‌లో హిందీ ఆంగ్లంలో ప్రసారం అయిన తర్వాత, దూరదర్శన్ నెట్వర్క్ ఛానెళ్లలో ప్రాంతీయ భాషలలో ప్రసారం చేయబడుతుంది. ఆకాశవాణి తన ప్రాంతీయ నెట్‌వర్క్‌లో రాత్రి 9 గంటల 30 నిమిషాల నుండి ప్రాంతీయ భాషా ప్రసారాలను అందిస్తుంది.

= = = = = = = = = = = = = = = = = =

దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా యువతకు కొత్త అవకాశాలను సృష్టించడానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. అనేక దేశాలతో భారత్ కుదుర్చుకుంటున్న వాణిజ్య

ఒప్పందాలతో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా లభిస్తున్నాయని తెలిపారు. 18వ రోజ్‌గార్ మేళాలో భాగంగా దేశంలోని వివిధ రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన 61 వేల మందికి పైగా అభ్యర్థులకు నియామక పత్రాలను ఢిల్లీ నుంచి దృశ్య మాధ్యమం ద్వారా ప్రధానమంత్రి ఈ రోజు అందజేశారు. ఈ సందర్భంగా యువతను ఉద్దేశించి మాట్లాడుతూ... పంపిణీ చేసిన నియామక పత్రాలు దేశ నిర్మాణానికి సరికొత్త ఆహ్వానంగా అభివర్ణించారు. రోజ్‌గార్ మేళా ద్వారా ఇప్పటివరకు లక్షలాది మంది యువతకు వివిధ ప్రభుత్వ విభాగాల నుండి నియామక పత్రాలను అందచేశామని నరేంద్ర మోదీ వెల్లడిస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = =

యువత శారీరకంగా, మానసికంగా, బలంగా ఉండాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఎదురైన ప్రతి సవాలును స్వీకరించడానికి సిద్ధంగా ఉండాలని కోరారు. ఢిల్లీ కంటోన్మెంట్‌లోని ఎన్‌సిసి రిపబ్లిక్ డే క్యాంప్‌లో క్యాడెట్లను ఉద్దేశించి ఆయన ఈ రోజు మాట్లాడుతూ... ఎన్‌సిసి క్యాడెట్ల నుండి ప్రేరణ పొందాలని దేశంలోని యువతకు పిలుపు ఇచ్చారు. దేశానికి రెండవ రక్షణ శ్రేణిగా ఎన్‌సిసి క్యాడెట్లను ఆయన అభివర్ణించారు. దేశ నిర్మాణానికి సహకారాన్ని అందించే యువతను మరింత ఉన్నతంగా తీర్చిదిద్దే అద్భుతమైన మాధ్యమంగా ఎన్‌సిసి ఉందని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొంటూ..

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = =

బుద్ధుని బోధనలు ప్రపంచ వ్యాప్తంగా ప్రభావితం చేస్తున్నాయని కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. న్యూఢిల్లీలో బౌద్ధంపై ఈరోజు జరిగిన రెండవ శిఖరాగ్ర సదస్సు 2026లో కేంద్రమంత్రి ఈ విషయం చెప్పారు. శక్తివంతంగా ఎదగాలనుకునే దేశం బుద్ధుని సూత్రాలను అనుసరించాలని ఆయన కోరారు. కలిసి ఎదగడం.. అనే భావనను ముందుకు తీసుకెళ్లడానికి బుద్ధుని మార్గాన్ని అనుసరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. బుద్ధుని జ్ఞానం, సందేశాన్ని వ్యాప్తి చేయడానికి కేంద్ర ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేస్తోందని కిరణ్ రిజిజు పేర్కొంటూ...

(వాయిస్ 26 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 130వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" తెలుగు అనువాదం ప్రధానమంత్రి ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, తిరిగి రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల ద్వారా ప్రసారం కానుంది.

విరామం

= = = = = = = = = = = = = = = = = =

దేశంలో పలు రాష్ట్రాలలో కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల నిర్మాణం విషయంలో ఎదురయ్యే జాప్యాన్ని గుర్తించి ఆయా సమస్యల పరిష్కారానికి వేదికగా ప్రగతి సమీక్షా సమావేశం నిలుస్తోంది. 2015లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రగతి వేదికగా పూర్తి స్థాయి సమీక్షలు ప్రారంభించినప్పటి నుంచి అనేక ప్రాజెక్టులకు సంబంధించిన ఆలస్యాన్ని, అవాంతరాలను నివారిస్తూ... వాటి పరిపూర్తికి బాటలు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం

ఉత్తరాఖండ్‌లో లక్షా 22 వేల లక్షల కోట్ల రూపాయల విలువ కలిగిన 15 ప్రాజెక్టులు ప్రగతి ఎకోసిస్టమ్ కింద సమీక్షించబడుతున్నాయి. ఆ వివరాలను ఇపుడు తెలుసుకుందాం.

ఉత్తర ప్రదేశ్ దేశంలో అత్యంత ప్రాధాన్యత గల హిమాలయ రాష్ట్రంగా ఉంది. దేశవ్యాప్తంగా కీలకమైన అనుసంధానంగా విద్యుత్ ఉత్పత్తి, టెలికాం విస్తరణ, యాత్రికుల మౌలిక వసతుల వంటి రంగాలకు సంబంధించిన ముఖ్యమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు ఈ రాష్ట్రంలో అమలవుతున్నాయి. ఉత్తరాఖండ్‌లో పర్యవేక్షణలో ఉన్న 42 ప్రాజెక్టులలో 10 ప్రాజెక్టులు ఇప్పటికే ప్రారంభించబడగా వాటి మొత్తం పెట్టుబడి విలువ 11 వేల 967 కోట్ల రూపాయలుగా ఉంది. అలాగే మరో 32 ప్రాజెక్టులు 3 లక్షల 37 వేల 597 కోట్ల రూపాయల పెట్టుబడితో ప్రస్తుతం అమలులో ఉన్నాయి. ఇలా జాతీయ ప్రాధాన్యత గల ప్రాజెక్టుల నిర్మాణం, అమలులో ఉత్తరాఖండ్ ఒక ప్రధాన కేంద్రంగా నిలిచింది.

= = = = = = = = = = = = = = = = = =

భారతదేశంలో లక్షన్నరకు పైగా అంకుర పరిశ్రమలు ఉన్నాయని కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ తెలిపారు. వీటి ద్వారా యువత అందిస్తున్న నూతన ఆవిష్కరణలు నవ భారత్ నిర్మాణంలో భాగం అవుతున్నాయని చెప్పారు. దేశవ్యాప్తంగా 45 ప్రాంతాలలో నిర్వహించిన 18వ జాతీయ రోజ్‌గార్ మేళాలో భాగంగా... చెన్నై సమీపంలోని ఆవడిలో జరిగిన సీఆర్‌పీఎఫ్ కార్యక్రమంలో కేంద్ర మంత్రిత్వ శాఖల విభాగాలలో నియమితులైన అభ్యర్థులకు కేంద్ర సహాయ మంత్రి నియామక పత్రాలను ఈరోజు అందజేశారు. ఈ సందర్భంగా ఎల్. మురుగన్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం ద్వారా వారి సంక్షేమం కోసం అనేక చర్యలు తీసుకుందని అన్నారు. 2047 నాటికి భారతదేశం అతి పెద్ద శక్తిగా అవతరించబోతోందని, ఆ సమయంలో కొత్తగా నియమితులైన అధికారులు ప్రభుత్వంలో కీలక పదవులను చేపట్టబోతున్నారని ఆయన చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = =

దేశీయ వస్త్ర రంగం గత దశాబ్ద కాలంలో గణనీయమైన పురోభివృద్ధి సాధించిందని కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ తెలిపారు. న్యూఢిల్లీలో ఈ రోజు నిర్వహించిన 74వ ఇండియా ఇంటర్నేషనల్ గార్మెంట్ ఫెయిర్ (ఐఐజీఎఫ్) సదస్సులో ఆయన మాట్లాడుతూ... దేశీయ మార్కెట్ కూడా 2025 నాటికి 6 లక్షల కోట్ల రూపాయల నుండి 13 లక్షల కోట్ల రూపాయలకు పెరిగిందని చెప్పారు. దేశంలోనే అత్యధిక ఉపాధి కల్పించే పరిశ్రమలలో ఒకటిగా వస్త్ర రంగం అవతరించిందన్నారు. ఐఐజీఎఫ్ అంతర్జాతీయ వస్త్ర కొనుగోలుదారులకు ఒక విశ్వసనీయమైన ప్రపంచ వేదికగా మారిందని గుర్తు చేశారు.

= = = = = = = = = = = = = = = = = =

అండర్-19 ప్రపంచ కప్ లో భారత్... న్యూజిలాండ్ తో బులవాయో వేదికగా జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. వర్షం కారణంగా మ్యాచ్‌ను 37 ఓవర్లకు కుదించారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్.. 36.2 ఓవర్లలో 135 పరుగులకు ఆలౌటైంది. డక్ వర్త్‌లూయిస్ పద్ధతి (DLS) ప్రకారం భారత్ లక్ష్యం 130 పరుగులుగా నిర్దేశించారు. ఈ లక్ష్యాన్ని భారత్ 13.3 ఓవర్లలోనే పూర్తి చేసింది. కెప్టెన్ ఆయుష్ మాత్రే 53 పరుగులు, వైభవ్ సూర్యవంశీ 40 రాణించారు.

= = = = = = = = = = = = = = = = = =

ఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో ఈనెల 26న జరిగే 77వ గణతంత్ర దినోత్సవ కవాతుకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఢిల్లీ సబ్ ఏరియా చీఫ్ ఆఫ్ స్టాఫ్ మేజర్ జనరల్ నవరాజ్ ధిల్లాన్ ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... గణతంత్ర దినోత్సవం సందర్భంగా భారత సైన్యం ఆపరేషన్ సిందూర్‌పై ఒక శకటాన్ని ప్రదర్శిస్తుందని చెప్పారు. అలాగే యుద్ధ ట్యాంకులు, క్షిపణి వ్యవస్థలు, డ్రోన్‌లు వంటి ప్రదర్శనలు ఉంటాయని అన్నారు. ఈ కవాతులో

సుమారు 6 వేల మంది సైనిక సిబ్బంది పాల్గొంటారని, లెఫ్టినెంట్ జనరల్ భవ్నీష్ కుమార్ నాయకత్వం వహిస్తారని తెలిపారు.

===================

===================